క్లుప్తంగా

టీబీ నివారణకు టీకా


ఆలూడిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

అగళి: మండల వ్యాప్తంగా టీబీ(క్షయ) నియంత్రణ చర్యల్లో భాగంగా డాక్టర్లు శివానంద, గాయత్రి ఆధ్వర్యంలో టీకా నివారణ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 ఏళ్లు దాటిన వారికి, ఐదేళ్ల కిందట మందులు వాడి టీబీ వాధి తగ్గిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం అలవాటు ఉన్న వారు, 60 ఏళ్లు పైబడిన వారికి టీకాను వేస్తున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

రొద్దం: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ- క్రాప్ నమోదు చేయించుకోవాలని వీఏఏ గోవిందప్ప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రొద్దం పంచాయతీలోని రైతులు పంట నమోదు దరఖాస్తు, ఆధార్ కార్డు జిరాక్స్, 1బీ, ఫోన్ నంబర్‌ను రైతు సేవా కేంద్రంలో అందజేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గోరంట్ల: గుమ్మయ్యగారిపల్లిలో గురువారం డాక్టర్ శృతి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దోమకాటుతో డెంగీ, మలేరియా, విషజ్వారాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ దోమతెర వాడాలని డాక్టర్ శృతి సూచించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇదిలా ఉండగా మూడో వార్డులో నిర్వహిస్తున్న హెల్త్ క్యాంప్‌ను డిప్యూటీ డీఎంహెచ్ఓ సునీల్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి రమణ, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు


గాయపడిన వ్యక్తి

మడకశిరరూరల్: మడకశిరకు ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంలో వస్తుండగా గురువారం యూ రంగాపురం సమీపంలో రోడ్డుపై వచ్చిన కుక్కను తప్పించబోయి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి మడకశిర పట్టణానికి చెందిన ముత్తు అని పోలీసులు తెలిపారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం


జిల్లేడుగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన అన్ని రకాల పోషక విలువలు తల్లిపాలలో ఉంటాయని మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ లీలావతి తెలిపారు. గురువారం జిల్లేడుగుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తప్పకుండా తల్లిపాలు తాపించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేసుకోండి

చిలమత్తూరు: రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన తమ పంటలకు వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట నమోదు చేయించుకోవాలని ఏఓ వంశీకృష్ణ గురువారం తెలిపారు. వ్యవసాయశాఖ నుంచి అందే పథకాలు, పంట నష్ట పరిహారం, పంటల బీమా, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోలు తదితరాలు వర్తిస్తాయన్నారు.

సేవాకేంద్రం ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రిటైర్డ్ అసిస్టెంట్ డీఎం నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యోగుల ఇంటర్‌నెట్ సేవాకేంద్రాన్ని గురువారం ఆర్డీఓ సన్నీవంశీకృష్ణ ప్రారంభించారు. ఉద్యోగులు ఇంటర్‌నెట్ సేవలను వినియోగించుకోవాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎం మైనోద్దీన్, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ డీఎం హరిత పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకుల దౌర్జన్యం

- అన్ని కమిటీల్లోనూ తమ మద్దతుదారులే ఎన్నికయ్యేలా దౌర్జన్యం
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు మెజార్టీ ఉన్న చోటా అడ్డగింపు
- కొన్ని చోట్ల ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు


మడకశిర మండలం కొండంపల్లి పాఠశాలలో ఎన్నిక నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: నియోజకవర్గంలో పాఠశాల కమిటీ ఎన్నికల్లో టీడీపీ నాయకులు దౌర్జన్యం చేసి, అన్ని కమిటీల్లోనూ తమ మద్దతుదారులు ఎన్నికయ్యేలా చూసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు మెజార్టీ ఉన్న చోట్ల కూడా ఆ కమిటీల ఎన్నిక జరగకుండా అడ్డుకొని, వాయిదాలు వేయించారు. నియోజకవర్గంలో 250 స్కూల్ కమిటీ ఎన్నికల్లో రెండూ చోట్ల ఎన్నిక వాయిదాపడింది. దాదాపు అన్ని టీడీపీ మద్దతుదారులు గెలుపొందినట్లు ప్రకటించారు. మలుగూరులోని ప్రాథమిక పాఠశాల కమిటీకి పూర్తి స్థాయి మెజార్టీ ఉన్నా ఎన్నికను ప్రకటించకుండా పాఠశాల హెచ్ఎంపై ఒత్తిడి చేశారు. పోలీసులు కూడా అధికార పార్టీ నాయకులకు ఒత్తాసు పలికారు. లేపాక్షి మండలంలోని మైదుగోళం పాఠశాల కమిటీ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ మద్దుతుదారులను బెదిరించి, స్కూల్‌లోకి రాకుండా అడ్డుకున్నారు.

మడకశిర: నియోజకవర్గంలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు రూరల్ సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. అమరాపురం, గుడిబండ, అగళి, రొళ్ల మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కూడా సజావుగా జరిగాయని అర్బన్ సీఐ మనోహర్ తెలిపారు.

మడకశిరరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన పాఠశాల అభివృద్ధి కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి తెలిపారు. సిద్దగిరిలో ఎంఈఓలు మాట్లాడుతూ అందరి సహకారంతో 119 పాఠశాలల్లో ఎన్నికలు ముగిశాయన్నారు.

గుడిబండ: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

రొళ్ల: మండలంలోని 65 పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం సజావుగా నిర్వహించారు. రొళ్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఎంఈఓ శ్రీధర్ హాజరై ఎస్ఎంసీ చైర్మన్, వైఎస్ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అగళి: మండలంలోని 45 పాఠశాలల్లో ఎంఈఓలు భాస్కర్, చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీని ఎన్నికలు నిర్వహించారు.

అమరాపురం: మండలంలోని 60 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ రాఘ వయ్య, వెంకటరమణనాయక్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఉన్న 58 ప్రభుత్వ పాఠశాలలకు గాను 57 పాఠశాలల్లో గురువారం ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఎన్నిక అవుతారనే ఉద్దేశంతో టీడీపీ నాయకులు 6,7,8 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల వద్దకు రాకుండా మేనేజ్ చేశారు. ఎన్నికలు వాయిదా వేసినట్లు హెచ్ఎం క్షీరలింగేశ్వర్ తెలిపారు. చోళసముద్రం జెడ్పీహెచ్ ఎస్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు చైర్మన్, వైస్ చైర్మన్‌లు కావడానికి అవకాశం ఉన్నా టీడీపీ నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులకు డబ్బు ఎరవేసి, కమిటీలను ఏకగ్రీవం చేశారు.

పెనుకొండ రూరల్: మండలవ్యాప్తంగా ఉన్న 49 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా జరిగినట్లు ఎంఈఓ-2 మధూడి సుధాకర్ తెలిపారు.

పరిగి: మండలవ్యాప్తంగా 59 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో చైర్మన్ ఎన్నికపై టీడీపీ నాయకులు ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ఊటుకూరు, మోదా పాఠశాలల ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నేతల జోక్యంతో ఉద్రిక్తంగా మారాయి.

ఎవరూ అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


ఎంపీటీసీ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎవరూ అధైర్యపడొద్దని అందరికీ అండగా ఉంటామని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ భరోసా ఇచ్చారు. గురువారం పందిపర్తి గ్రామంలో పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అప్పుడే వ్యతిరేకత మొదలైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలకు బుద్ధి చెప్పడానికి వారు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం అండగా నిలవాలని తెలిపారు. అధికార దర్పంతో కేసులు బనాయిస్తే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి గజేంద్ర, స్థానిక నాయకులు సదాశివరెడ్డి, రవీంద్ర రెడ్డి, రామకృష్ణారెడ్డి, న్యాయవాది బాలాజీ, ఆవుల నరసింహమూర్తి పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

స్థానిక గీతానగర్‌కు చెందిన ఎంపీటీసీ రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నేత ఆంజనేయులు సోదరుడు రమేష్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ ఎంపీటీసీ నివాసానికి వెళ్లి పరామర్శించారు. మృతుడి భార్య ఉషాను ఓదార్చి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్థానిక నాయకులు శ్రీనివాసులు, పోలేపల్లి హనుమంతు, గూడూరు రమేష్, కళ్యాణ్, మురళి, గోపాల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి


మారుతీశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాణిపాకం ఆలయ కమిటీ ట్రస్టు మాజీ డైరెక్టర్ కరణం మారుతీశ్వరరావు(74) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. ఈయన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పని చేశారు. మారుతీస్వామి పిలుచుకునే ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మండల కేంద్రానికి చేరుకుని మారుతీశ్వరరావు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె వెంట మండల కన్వీనర్ నరసింహమూర్తి, నాయకులు ఉన్నారు.

మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకుల సమావేశం


మాలింగప్పను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని కేపీ స్కూల్‌లో గురువారం నియోజకవర్గంలోని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు సమావేశమయ్యారు. ఎంఈఎఫ్ నాయకులు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఎస్సీ వర్గీకరణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా 15 ఏళ్లుగా పని చేస్తున్న మాలింగప్పను ఘనంగా సన్మానించారు. మాలింగప్ప అనేక సమస్యలపై పోరాటం చేశారని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం కార్యదర్శి భూతన్న, స్థానిక నాయకులు రామకృష్ణ, రంగనాథ్, కదురన్న, సురేష్, రంగన్న, దేవరాజు, రామాంజనేయులు, డాక్టర్ శివన్న, రామాంజప్ప తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్నే చిరు వ్యాపారులు

మడకశిర: పట్టణంలోని మధుగిరి సర్కిల్‌లో చిరు వ్యాపారులు గురువారం నియోజకవర్గ సీపీఐ ఇన్‌చార్జ్ పవిత్ర ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేశారు. మడకశిర మార్కెట్‌లో చిరు వ్యాపారులు పూలు, కూరగాయాలను అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. అయితే కొందమంది దళారులు రంగ ప్రవేశం చేసి పెద్దస్థాయిలో మండీలు ఏర్పాటు చేసి పూలు, కూరగాయలను విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో చిరు వ్యాపారులకు విక్రయాలు తగ్గి నష్టపోతున్నారు. దీంతో చిరు వ్యాపారులు మధుగిరి సర్కిల్‌లో ధర్నాకు దిగారు. రాస్తారోకో చేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దళారీలు కూరగాయలు, పూల మండీలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్బన్ సీఐ మనోహర్ తన సిబ్బందితో వెళ్లి చిరు వ్యాపారులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో చిరు వ్యాపారులు ధర్నా విరమించారు.

రక్తదానంతో వేరొకరికి పునర్జన్మ


రక్తదానం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఆపదలో ఉన్నా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో చేసే రక్తదానంతో వేరొకరికి పునర్జన్మ లభించినట్లని సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ మహమ్మద్ జీషాన్, వైద్యాధికారులు చరణ్‌కుమార్, కౌశిక్, కళాశాల కార్యదర్శి బైసాని రామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో సెంట్రల్ జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీఎస్‌వీఎస్ ప్రసాద్, నాగేంద్రకుమార్, ముస్లీం నగారా ఉమర్‌ఫారూక్, ఎన్‌సీసీ అధికారి ఫణీంద్ర, ఎన్ఎస్ఎస్ పీఓ రాజన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడి మృతి


నారాయణప్ప(ఫైల్)

పావగడ: స్థానిక వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణప్ప (50) అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందాడు. తాలూకాలోని చిక్కహళ్లికి చెందిన ఆయన నీలమ్మనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించేవాడు. కొన్ని రోజులుగా మెదడు సంబంధిత వ్యాధితో బాధ పడుతూ తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి లో చికిత్స పొందేవాడు. అయితే వ్యాధి ముదిరిపోవడంతో పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. ఆయన మృతిపై స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ, వ్యాయామ శిక్షణ అధికారి బసవరాజు, తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు.

'ఈ పంట' నమోదు చేసుకోండి


వేరుశనగలో ఈ పంట నమోదు చేస్తున్న ఏఓ వీరనరేష్

గుడిబండ: రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏఓ వీరనరేష్ సూచించారు. మండలంలోని రాళ్లపల్లిలో గురువారం ఈ- పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ సాగు చేసిన పంటలను ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాముల సయ్యాట


డీఆర్‌కాలనీ వద్ద సయ్యాటలాడుతున్న పాములు

హిందూపురం అర్బన్ : పట్టణంలోని డీఆర్‌కాలనీ సమీపంలో గురువారం నాగపంచమి రోజు రెండు పాములు పెనవేసుకొని రెండు గంటలకు పైగా సయ్యాటలాడాయి. చివరకు అక్కడే పక్కనే ఉన్న ముళ్ల చెట్లలోకి వెళ్లిపోయాయి.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ఏర్పాటు

కదిరి అర్బన్: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రతి శనివారం కదిరి నుంచి నల్లచెరువు మండలం పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయానికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనోద్దీన్ గురువారం తెలిపారు. ములకలచెరువు నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని, భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

చదువుతోనే ఉజ్వల భవిత


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్

అమడగూరు: చదువుతోనే ఉజ్వల భవిత సాధ్యమని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముందుగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు జ్ఞాపికలను ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యాపకులు మాట్లాడుతూ తల్లితండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని విద్యార్థులు అంకుఠిత దీక్షతో చదువుకోవాలన్నారు. తర్వాత విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అధ్యాపకులు షానవాజ్, రఘునాథరెడ్డి, ఇందాదుల్లా, గంగన్న, సూర్యప్రకాష్, జయరాంనాయక్, ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కలెక్టరేట్ సూపరింటెండెంట్

పుట్టపర్తి అర్బన్: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్-1గా సాకే నాగరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎన్నికల అధికారి మైనుద్దీన్, యశ్వంత్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం


సమావేశానికి హాజరైన విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బాలల సంరక్షణ సమితి కౌన్సిలర్ శివలత సూచించారు. గురువారం మండల పరిధిలోని కనుముక్కల ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అలాగే బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్వతి, సోషల్ వర్కర్ వనజాక్షి, ప్రసన్నలక్ష్మి, శ్రావణి, ఏఎన్ఎం సునీత, ఎంఎల్‌హెచ్‌పీ సౌందర్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్విట్ ఇండియా డే


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ కేశవరావు మాట్లాడుతూ నేటి విద్యార్థులు క్విట్ ఇండియా, స్వాతంత్ర్యోద్యమం గురించి తెలుసుకోవాలన్నారు. వాటి స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ యశోద, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు ఆరోగ్యం

కనగానపల్లి: బిడ్డ పుట్టిన తర్వాత తొలిసారిగా తల్లి ఇచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యకరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. గురువారం మామిళ్లపల్లిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అంగనవాడీ వర్కర్లు, హెల్పర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మనశ్శాంతి

అమరాపురం: ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవడం ద్వారా మనశ్శాంతి లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఈరన్న, సర్పంచ్ గోవిందరాయ, అన్నారు. గురువారం మండలంలోని మద్దనకుంట గ్రామంలో ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విశ్వ విద్యాలయం వారు నూతనంగా శివ స్మృతి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వచ్చిన బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం, శిర నిర్వాహకుడు మహేంద్రన్న, సర్పంచ్, మాజీ ఎమ్మెల్యే ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అమరాపురం ఈశ్వరీయ విశ్వ విద్యాలయం నిర్వాహకురాలు పుష్పక్క, రాజయోగిలు మహేంద్ర, మధుబన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన డీఎస్పీ


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పెనుకొండ: రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖామాత్యులు సవితను డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు గురువారం కలిశారు. తహసీల్దార్ శ్రీధర్ మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. మంత్రి పలు విషయాలపై డీఎస్పీ, తహసీల్దార్‌తో చర్చించారు.

బాధితులకు సరుకుల కిట్లు అందజేత


సరుకులు అందిస్తున్న స్వామిజీ

పావగడ: ఉత్తర కర్ణాటక గోకాక్ తాలూకాలోని అత్యంత కుగ్రామాలైన మసాగుప్పె, హుణసెహాల్ గ్రామాల్లో సుమారు వెయ్యి మంది రైతులు, కూలీలు, కార్మికులకు వరద పరిహార సామగ్రిని స్వామి జపానంద గురువారం పంపిణీ చేశారు. వరద బాధితులకు స్వామి జపానంద ఆసరాగా నిలిచారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో బాధితులకు సరుకుల కిట్లు అందిస్తున్నట్లు స్వామిజీ తెలిపారు. సుమారు 500 కిలోమీటర్లు పర్యటించి బాధితులకు సరుకుల కిట్లు అందించినట్లు స్వామిజీ తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి బృందం తదితర వలంటీర్లు సహకరించారన్నారు.

మండల మీట్ వాయిదా

పరిగి: ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు కార్యాలయ ఏఓ అశ్వర్థప్ప తెలిపారు. ఎస్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో సమావేశం వాయిదా వేశామని, తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

జాగ్రత్తలతోనే కత్తెర పురుగు నివారణ


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మంజునాథ్

హిందూపురం: మొక్కజొన్న పంట సాగులో జాగ్రత్తలు పాటిస్తే కత్తెర పురుగు నివారించుకోవచ్చని ఏఓ సురేంద్రనాయక్ అన్నారు. గురువారం పూలకుంట రైతుసేవా కేంద్రంలో సర్పంచ్ మంజునాథ్ ఆధ్వర్యంలో మండలంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులకు ఈపంట నమోదుపై అవగాహన కల్పించారు. ఏఓ సురేంద్రనాయక్ మాట్లాడుతూ ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట నష్ట పరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్, సున్నావడ్డీ, పంటల కొనుగోలు, ప్రభుత్వ పథకాలు ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. ఉద్యాన శాఖ,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలపై తెలియజేశారు. అన్ని ప్రభుత్వ పథకాలను రైతు సేవాకేంద్రం వద్ద నోటీస్ బోర్డ్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి మహేష్, రైతు సేవ కేంద్రం సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

ఎంజేపీలో వైద్య శిబిరం

చిలమత్తూరు: మండలంలోని టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారిణి డాక్టర్ తేజశ్విని గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు.